సుళ్య తాలూకాలో మావోయిస్టుల కోసం కూంబింగ్

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ, కొడగు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన సుళ్య తాలూకాలో మావోయిస్టుల కోసం యాంటి నక్సల్స్ ఫోర్స్ (ఏఎన్ఎఫ్) బలగాలు గాలింపులు చేపట్టాయి. శనివారం కూజిమలె అటవీ ప్రాంతంలో మావోయిస్టుల బృందం సంచరించినట్టు స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు ఏఎన్ఎఫ్‌కు సమాచారం అందించారు. దీంతో సోమవారం కార్కళ నుంచి వచ్చిన ఏఎన్ఎఫ్ బలగాలు కూజిమలె అటవీ ప్రాంతంలోని బాళగూడిన, ఉప్పుకళ, కూజిమళ, కడమకల్లు ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించాయి.



ప్రధాని మోదీని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



మలెనాడులో మోదీ గర్జన

● 28 సీట్లలోనూ గెలిపించాలంటూ ప్రజలకు పిలుపు ● ప్రధాని రోడ్‌షోకు అనూహ్య స్పందన ● సాహసోపేత నిర్ణయాలు మోదీకే సాధ్యం : యడియూరప్ప



ప్రజలకు ప్రధాని మోదీ అభివాదం

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రచార భేరిని కొనసాగిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప సొంత జిల్లా శివమొగ్గలో సోమవారం ప్రధాని ప్రచార హోరు సాగింది. జూన్ 4న వెలువడే లోక్‌సభ ఫలితాలలో ఎన్డీయే స్కోర్ 400 దాటాలని, ఇందులో కర్ణాటక ప్రజలు ప్రధాన పాత్ర పోషించాలంటూ ప్రధాని తన ప్రసంగంలో రెండుమూరు సార్లు ప్రస్తావించారు. కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈసారి ఫలితాలు కాంగ్రెస్ దిమ్మతిరిగేలా ఉంటాయని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పేదలను మరింత పేదలుగా మారిస్తే, తాము వారిని సంక్షేమ బాటలో నడిపిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చాపకింద నీరులా విస్తరిస్తున్న ఉగ్రవాద కార్యకలాపాలపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం సంఘ విద్రోహ, ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా వివరించిన ఆయన వీటి ద్వారా కన్నడిగులు గరిష్టంగా ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. తొలుత 'కర్ణాటకద కోటి కోటి జనరిగె నన్న నమస్కారగళు..'అంటూ కన్నడలో ప్రారంభించిన ఆయన సిగందూరు చౌడేశ్వరికి వందనెగళు అంటూ ప్రసంగాన్ని ముగించారు. బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, మాజీ సీఎం యడియూరప్ప మాట్లాడుతూ మోదీజీ భారతదేశ ఆశాకిరణమని ప్రశంసలు గుప్పించారు. విశ్వగురుగా జేజేలు అందుకుంటున్న మోదీ కర్ణాటక పవిత్రగడ్డపై ప్రచారం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం కేవలం ఎన్నికల కోసం పని చేయదని, సరిహద్దు భద్రత, ఆర్టికల్ 370 రద్దు, శ్రీరామమందిర నిర్మాణం వంటి సాహసోపేతమైన నిర్ణయాలను అమలు చేసిందన్నారు. కేంద్రంలో బలిష్టమైన నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాలను భారీ మెజారిటీతో గెలిచి ప్రధాని మోదీకి కానుకగా సమర్పిస్తామని ప్రతినబూనారు. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీవై రాఘవేంద్ర మాట్లాడుతూ మరోసారి మోదీని ప్రధానిగా చూడాలని దేశ ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారని అన్నారు. ప్రధాని సభకు భారీగా జనం తరలిరావడంతో మహాసాగరాన్ని తలపిస్తోందన్నారు. ప్రధాని చొరవ కారణంగానే శివమొగ్గకు మెడికల్ కళాశాల, ఆయుర్వేద కళాశాల, పాస్‌పోర్ట్ కేంద్రం వంటివి మంజూరయ్యాయని తెలిపారు. బీజేపీ సీనియర్ నేత సీటీ రవి మాట్లాడుతూ హిందుత్వ, అభివృద్ధి తమకు రెండు కళ్లలాంటివన్నారు. దేశవ్యాప్తంగా కాషాయ గాలులు బలంగా వీస్తున్నాయని తెలిపారు. ఈ ఎన్నికలు తుకడె గ్యాంగ్, దేశభక్తుల మధ్య జరుగుతున్న పోరు అన్నారు.

వేదికపై అభ్యర్థులను పరిచయం చేసిన ప్రధాని

వేదికపై బీజేపీ అభ్యర్థులను ప్రధాని మోదీ ప్రజలకు పరిచయం చేస్తూ వీరిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. దక్షిణకన్నడ అభ్యర్థి కెప్టెన్ బ్రిజేశ్ చౌట, బెంగళూరు రూరల్ అభ్యర్థి డాక్టర్ సీఎన్ మంజునాథ్, ఉడుపి-చిక్కమంగళూరు అభ్యర్థి కోట శ్రీనివాసపూజారి, శివమొగ్గ అభ్యర్థి బీవై రాఘవేంద్ర, దావణగెరె అభ్యర్థి గాయత్రి సిద్దేశ్వర్ వేదికపై ఆశీనులయ్యారు.



ప్రసంగిస్తున్న ప్రధాని

రోడ్‌షోకు అనూహ్య స్పందన

ప్రధాని నరేంద్రమోదీకి శివమొగ్గలో ఘనస్వాగతం లభించింది. రెండు చేతులు ఊపుతూ సభకు భారీ సంఖ్యలో వచ్చిన కార్యకర్తల్లో ఉత్సాహం రేకెత్తించారు. భారత్ మాతాకి జై, మనందరి కుటుంబం మోదీ కుటుంబం నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది. కాంగ్రెస్‌ను విమర్శించినప్పుడల్లా సభలో కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

ఈశ్వరప్ప డుమ్మా



ఊహించినట్టే ప్రధాని నరేంద్రమోదీ సభకు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి కేఎస్ ఈశ్వరప్ప హాజరు కాలేదు. తన కుమారుడు కాంతేశ్‌కు హావేరి టిక్కెట్ ఇవ్వనందుకు అలకబూనిన ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఇప్పటికే ప్రకటించిన సంగతి విదితమే. శివమొగ్గ నగరంలోనే ఉన్నా ప్రధాని సభవైపు ఆయన ముఖం చూపకపోవడంతో బీజేపీ శ్రేణుల్లో కలకలం ప్రారంభమైంది.



ఈలలు వేస్తున్న లంబాడీ మహిళ

పెద్దసంఖ్యలో పాల్గొన్న ప్రజలు, అభిమానులు

కాంగ్రెస్ నుంచి ఆహ్వానం

● నేడు నిర్ణయం ప్రకటిస్తా

● కేంద్రమాజీ మంత్రి సదానందగౌడ



బెంగళూరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, కేంద్ర మాజీమంత్రి బెంగళూరు ఉత్తర ఎంపీ సదానందగౌడకు కాంగ్రెస్ ఆహ్వానం పలికింది. ఇదే విషయాన్ని స్వయంగా సదానందగౌడ సోమవారం మీడియాకు తెలిపారు. ప్రధానమంత్రి కేబినెట్‌లో కొన్నేళ్లు మంత్రిగా వ్యవహరించిన ఆయనను రెండున్నరేళ్ల కిందట తొలగించారు. ఆయనకు మరోసారి టిక్కెట్ ఇచ్చేది లేదని ఇప్పటికే అధిష్టానం స్పష్టం చేసింది. ఇదే తరుణంలోనే కాంగ్రెస్ పార్టీ సదానందగౌడను పార్టీలోకి చేర్చుకునేందుకు సిద్ధమైంది. వారం కిందటే ఇదే విషయాన్ని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రకటించారు. బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు కాంగ్రెస్‌లోకి వస్తారన్నారు. అప్పటికే సదానందగౌడతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. సదానందగౌడ మీడియాతో మాట్లాడిన వేళ కాంగ్రెస్ కీలక నేత ఒకరు ఆదివారం తమ ఇంటికి వచ్చి మాట్లాడారని తెలిపారు. ఇదే రోజున తన జన్మదినం ఉన్నందున ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కుటుంబ సభ్యులతో చర్చించి మంగళవారం తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. కాంగ్రెస్‌లో చేరుతారా అన్న మీడియా ప్రశ్నకు సమాధానం దాటవేశారు.

బోర్లు ఎండిపోవడంతోనే నీటి సమస్య

● మూడు నెలల వరకు కావేరి నీటికి ఢోకా లేదు ● చెరువుల పునరుజ్జీవనం... బోరుబావుల తవ్వకాలు నిరంతరం ● నీటి సమస్య పరిష్కారానికి నిపుణుల కమిటీ : సీఎం



మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర శివారు ప్రాంతాల్లో నివసించేవారంతా బోరుబావులపైనే ఆధారపడ్డారని, ప్రస్తుతం అవి ఎండిపోవడంతోనే నీటి సమస్య తీవ్రమైందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్పష్టం చేశారు. బెంగళూరులో నీటి సమస్యపై అధికారులు, జలనిపుణులు, మంత్రులతో సోమవారం అధికారిక నివాసం కృష్ణలో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ నగర పరిధిలో 14వేల బోరుబావుల్లో ఏకంగా 6,900 బోరుబావులు భూగర్భజలాలు లేక ఎండిపోయాయన్నారు. నగర పరిధికి చెందిన 110 గ్రామాల్లో 55కు పైగా ప్రాంతాల్లో సమస్య నెలకొందన్నారు. జూన్ నెలాఖరుకు కావేరీ ఐదో విడత పైప్‌లైన్‌ల పనులు పూర్తవుతాయని, దీంతో 775 ఎంఎల్‌డీల అదనపు నీరు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం నగర వ్యాప్తంగా కావేరి నీటిని సరఫరా చేసే అన్ని ప్రాంతాలకు జూన్ నెలాఖరు దాకా సమస్య ఉత్పన్నం కాదన్నారు. కావేరికి అనుబంధమైన కేఆర్ఎస్‌లో 11.02 టీఎంసీలు, కబినిలో 9.02 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. వీటిని జూన్ నెలాఖరు దాకా సరఫరా చేయవచ్చు అన్నారు. 313 ప్రాంతాల్లో కొత్తగా బోరుబావులకు అనుమతులు ఇచ్చామని, ఎండిపోయిన 1200 బోరుబావుల లోతు పెంచేందుకు ఆదేశించామని తెలిపారు. మురికివాడలు, ఎత్తు ప్రదేశాలతో పాటు బోరుబావులపైనే ఆధారపడిన ప్రాంతాల్లో తాత్కాలికంగా కర్ణాటక మిల్క్‌ఫెడరేషన్‌తో పాటు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామని కంట్రోల్ రూంకు ఫిర్యాదు రాగానే స్పందించేలా ఆదేశించామన్నారు. కోలార్ జిల్లా చెరువులకు కేసీవ్యాలీ నీటిని మళ్లించినట్లే బెంగళూరు పరిధిలోని చెరువులను భర్తీ చేస్తామన్నారు. తాగునీటికి నిధుల కొరత లేదని, ఎంతమేర అవసరమైనా బెంగళూరు పాలికె సమకూరుస్తుందన్నారు. నీటి కొరత పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిపుణుల కమిటీను ఏర్పాటు చేశామని, రోజూ అధికారులతో సమీక్షించి వారానికోసారి ప్రణాళికలు సిద్ధం చేస్తారని తెలిపారు. నగరంలో నీటి సమస్య తీవ్రమైతే బెంగళూరు మహానగర పాలికె, జలమండలిదే బాధ్యత అన్నారు. ప్రస్తుతం నగరానికి 500 ఎంఎల్‌డీల నీటి కొరత ఉందన్నారు. 1700 నీటి ట్యాంకర్లు బెంగళూరు పాలికెలో రిజిస్టర్ చేసుకున్నాయని, ప్రైవేటు బోరుబావుల నుంచి సేకరించి పంపిణీ చేస్తామన్నారు.

ప్రజలు తాగునీటిని వృథా చేయరాదని, గార్డెన్లకు తాగునీరు వాడరాదని సూచించారు. తాగునీరు, పరిశ్రమలు, వాణిజ్య భవనాలకు 2600 ఎంఎల్‌డీల నీరు అవసరంగా కాగా 1450 ఎంఎల్‌డీలు కావేరి నుంచి లభిస్తోందన్నారు. 650 ఎంఎల్‌డీలు బోరుబావుల నుంచి లభిస్తుండగా 500 ఎంఎల్‌డీల కొరత ఉందన్నారు. నీటి దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు 143 టాస్క్‌ఫోర్స్‌ల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందన్నారు. తాగునీటి కోసం హెల్ప్‌లైన్ 1916కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	: మంగళవారం సాయంత్రం 06:32
సెహరి	: బుధవారం ఉదయం 05:11

రాష్ట్రంలో నిధుల కొరతపై ప్రధాని వ్యాఖ్యలు అర్ధరహితం

రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో కరువు వచ్చి ఐదునెలలు అవుతోందని, కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు. రూ.18,171 కోట్లు కరువు సాయం కోరామని, రూపాయి కూడా విడుదల కాలేదన్నారు. 48వేల హెక్టార్లలో పంటనష్టం జరిగిందన్నారు. ఇంత జరిగినా అభివృద్ధికి ఎక్కడా ఆటంకం లేకుండా పాలన సాగిస్తుంటే తమ వద్ద నిధులు లేవనేందుకు ప్రధానికి ఏవిధంగాను నైతికత లేదన్నారు. ఉపాధి పనిదినాలు పెంచాలని కోరినా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌లో పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారని, బీజేపీకి కొరత ఉందన్నారు. శ్రీరాముడు, మోదీ పేరుతో ఎన్నికలకు వెళతామనే రాష్ట్ర బీజేపీ నాయకుల వ్యాఖ్యలపై స్పందిస్తూ మోదీ ప్రచారం చేసిన ప్రతి చోటీ తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మండ్య లోక్‌సభ జేడీఎస్‌కే

● నిఖిల్ లేదా కుమారస్వామి పోటీ ● చిక్కబళ్లాపురకు వెళ్లాలని సుమలతకు సూచన



బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండ్య లోక్‌సభ స్థానం బీజేపీతో పొత్తులో భాగంగా జేడీఎస్ పరం కావడంతో ఇక్కడి నుంచి కుమారస్వామి లేదా నిఖిల్‌కుమార్‌లలో ఒకరు అభ్యర్థి కానున్నారు. జేడీఎస్ పార్టీ రెండు నెలల కిందటే మండ్యనుంచి మాజీ మంత్రి పుట్టరాజు పోటీ చేసేలా సూచించింది. అందుకు అనుగుణంగానే పుట్టరాజు ప్రచారం సాగించుకుంటున్నారు. అనూహ్యంగా ఇదే స్థానం నుంచి పుట్టరాజుకు బదులుగా కుమారస్వామి లేదా నిఖిల్‌ను పోటీ చేయించాలని జేడీఎస్‌తో పాటు బీజేపీకి చెందిన స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తులో భాగంగా జేడీఎస్‌కు మండ్య, హాసన్, కోలార్ స్థానాలు కేటాయించారు. హాసన్ నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ మరోసారి అభ్యర్థి కానున్నారు. ఇక మిగిలిన కీలక నియోజకవర్గం మండ్య కావడంతో దేవెగౌడ కుటుంబానికి చెందినవారే పోటీ చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇదే జరిగితే మండ్య సిట్టింగ్ ఇండిపెండెంట్ ఎంపీ, ప్రస్తుతం బీజేపీకి మద్దతు ఇస్తున్న సుమలతకు చిక్కబళ్లాపుర నుంచి పోటీ చేయడం అనివార్యం కానుంది. ఆమె మండ్య మినహా మరో నియోజకవర్గానికి వెళ్లేది లేదని కొంతకాలంగా చెబుతున్నారు. రెండునెలల వ్యవధిలో బీజేపీ అగ్రనేతలతో నాలుగైదుసార్లు చర్చలు జరిపారు. తాజాగా ఆదివారం అగ్రనేతల పిలుపు మేరకు ఢిల్లీ వెళ్లారు. పొత్తులో భాగంగా మండ్య జేడీఎస్‌కు కేటాయించామని, సహకరించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించినట్లు తెలుస్తోంది. మండ్య అభ్యర్థి విజయానికి పనిచేయాలని కూడా సూచించినట్లు సమాచారం. చిక్కబళ్లాపుర నుంచి పోటీ అంశమై నిర్ణయం తీసుకోవాలని వివరించినట్లు తెలుస్తోంది. బెంగళూరు నగర పరిధిలో సెంట్రల్‌ను మరోసారి పీసీ మోహన్‌కు, ఉత్తర స్థానం శోభాకరంద్లాజెకు, దక్షిణ నుంచి మరోసారి తేజస్వీ సూర్యను అభ్యర్థులుగా ప్రకటించారు. బెంగళూరు గ్రామీణ నుంచి అనూహ్యంగా డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభ్యర్థి అయిన విషయం తెలిసిందే. దీనిని బట్టి బెంగళూరు పరిధిలో పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో సుమలత పోటీ చేస్తే చిక్కబళ్లాపుర నుంచి లేదా ప్రస్తుత ఎన్నికల బరి నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరో రెండు రోజుల్లోనే బీజేపీ మిగిలిన అభ్యర్థులు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి.

జేడీఎస్‌ను విశ్వాసంలోకి తీసుకోలేదు

● మాతో పొత్తు వల్ల బీజేపీకి 18 నియోజకవర్గాల్లో లబ్ధి

● మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి అసంతృప్తి



బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్‌ను తమ మిత్రపక్షమైన బీజేపీ పూర్తిస్థాయిలో విశ్వాసంలోకి తీసుకోవడం లేదని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గ విషయంలో ఇంకా స్పష్టత ఇవ్వకుండా జాప్యం చేస్తుండడంపై ఆయన ఒకింత ఆక్రోశం వ్యక్తం చేశారు. రాష్ట్రలో తమ శక్తి తమకు తెలుసునని అందుకే ఆరేడు సీట్లు కాకుండా మూడునాలుగుసీట్లను బీజేపీని అడిగామన్నారు. అవి కూడా ఇచ్చేందుకు తటపటాయిస్తున్న వైనం సరికాదన్నారు. తమతో పొత్తు కారణంగా బీజేపీకి 18 నియోజకవర్గాల్లో లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. హాసన్, మండ్య నియోకవర్గాలు తమకు కంచుకోటలని, ఇక్కడ సులభంగా గెలుస్తామని తెలిపారు. ఇక మిగిలిన ఒక సీటుకోసం తాను ఢిల్లీకి వెళ్లి వెంపరాల్లాడాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కర్ణాటక రాజకీయాలు, జాతీయ రాజకీయాలు వేరనే సంగతిని బీజేపీ గుర్తించాలన్నారు. హాసన్, మండ్య, కోలారు నియోజకవర్గాలలో తమ పార్టీ పోటీ చేసి తీరుతుందన్నారు. మరోమారు ఢిల్లీకి వెళ్లే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు పార్టీ కోర్ కమిటీ ప్రత్యేకంగా సమావేశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జీటీ దేవేగౌడ, సభ్యులు బండెప్ప కాశంపూర్, సమృద్ధి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షల వివాదంపై హైకోర్టులో వాదనలు

● ఇంకా వెలువడని తీర్పు

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 5, 8, 9, 11 తరగతులకు పబ్లిక్ పరీక్షల వివాదం ఇంకా తేలలేదు. పబ్లిక్ పరీక్షలు కొనసాగించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసిన ఏకసభ్య ధర్మాసనం తీర్పుపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సమగ్ర విచారణ జరిపింది. సోమవారం ప్రభుత్వం తరపున, ప్రైవేట్ విద్యాసంస్థల తరపున న్యాయవాదుల వాదనలు ఆలకించారు. న్యాయమూర్తులు జస్టిస్ కె. సోమశేఖర్, జస్టిస్ రాజేశ్ కేరై ధర్మాసనం ఇరువురి వాదనలకు అవకాశం ఇచ్చింది. రాష్ట్ర విద్యాశాఖ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా 2023 అక్టోబరు 6, 9 తేదీలలో రెండు ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల సమాఖ్య హైకోర్టును ఆశ్రయించడంతో ఏకసభ్య ధర్మాసనం రద్దు చేసింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు హైకోర్టు ఫుల్‌బెంచ్‌కు వెళ్లాలని సూచించింది. ఈ ప్రక్రియ సాగుతుండగానే విద్యాశాఖ రెండు సబ్జెక్టుల పరీక్షలు జరిపింది. అభ్యంతరం వ్యక్తం కావడంతో తాత్కాలికంగా నిలిపివేసింది. ఎటువంటి తీర్పు వెలువరిస్తుందోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.73	1,596.22
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,692	9,226
సామర్థ్యం (టీఎంసీలు)	5.93	17.02

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీసీ



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మార్చి 18: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ కఠినంగా అమలు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన జిల్లా వ్యాప్తంగా నియమావళి అమలులో ఉండగా గత రెండు రోజుల్లో సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న 43,096 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనుమతి లేని ఐదు వాహనాలను సీజ్ చేశామన్నారు. ఆదివారం పోలీసు శాఖలు సంయుక్తంగా 323,75 లీటర్లు,రూ 119.853, 2వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 4కేసులు నమోదు చేసినట్లు డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ఎవరైనా అధిక మద్యం, నగదు తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

టమోటా @ రూ.20

● తగ్గిన టమోటా ధర ● గిట్టుబాటు కాక అన్నదాత విలవిల ● రవాణా ఖర్చులు రాక పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు

కంప్లి, మార్చి 18 : తగ్గిన ధరలతో టమోటా రైతు విలవిలలాడుతున్నారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి టమోటా సాగు చేశారు. కానీ మార్కెట్లో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రాక నష్టాల పాలయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప, బెండ, చిక్కుడు, వంకాయ, క్యారెట్, బీన్స్ ధరలు మార్కెట్లో ఆకాశాన్ని తాకుతున్నాయి. కానీ టమోటా ధరలు మాత్రం పూర్తిగా పడిపోయాయని ఆందోళన చెందుతున్నారు. కంప్లి, కురుగోడు తాలుకాల్లో బోర్ల కింద వేల హెక్టార్లలో పంటలు వేశారు. కొళూరు, దమ్మూరు, కురుగోడు, ముష్టిగట్టి, లక్ష్మీపుర, శ్రీనివాస క్యాంపు, ఎమ్మిగనూరు, కంప్లి, తదితర భాగాల్లో అధికంగా టమోటా సాగు చేశారు. అయితే తీరా పంట చేతికొచ్చే సరికి ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 25 కిలోల బాక్స్ రూ. 60 పలుకుతోంది. కిలో ధర రెండు రూపాయలు కూడా పలకడం లేదు. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని అన్నదాత వాపోతున్నారు. కొందరు రైతులు గిట్టుబాటు కూడా కాదని పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఎమ్మిగనూరు గ్రామానికి చెందిన మారెష్ తన రెండు ఎకరాలల్లో సాగు చేసిన టమోటా పంటను మార్కెట్‌కు తరలించారు. అయితే మార్కెట్లో ధరలు లేకపోవడంతో పెట్టుబడిలో సగం కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాట్లు, పిచికారి మందులు, కూలీల సొమ్ము పెరిగిపోయాయని, ప్రభుత్వాలు ఇతర కాయగూరల మాదిరిగానే టమోటాకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. అలాగే కంప్లి వ్యవసాయ కృషి కేంద్రం వద్ద రైతు కొట్టాల నాగరాజు పొలం పైనే టమోటా పంటను వదిలేసి, పశువులకు మేతగా వేశానని, ఇంత నష్టాలు ఎప్పుడూ చూడలేదని వాపోయారు. మొత్తానికి ఈ యేడాది టమోటా పంట రైతులకు నిరాశనే మిగిల్చింది.



కంప్లి వ్యవసాయ కృషి కేంద్రం వద్ద పొలంపైనే వదిలేసిన టమోటా పంట



టమోటాను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు మారేష్





విద్యుత్ దీపాల అలంకరణలో కనక దుర్గమ్మ ఆలయం

నేడు కనకదుర్గమ్మ సిడిబండి రథోత్సవం

బళ్లారి సిటీ/రూరల్, మార్చి 18: నగర ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ ఆలయంలో సిడిబండి రథోత్సవం మంగళవారం జరగనుంది. తెల్లవారుజామున 3గంటల నుంచి రాత్రి 11-30 గంటల వరకు దుర్గమ్మ ద ర్శనం ఇవ్వనుంది. అమ్మవారికి బంగారు ఆభరణాలతో అలకంరించనున్నారు. ఆల య ప్రాంగణాన్ని పూలతో శోభాయా మానంగా అలంకరించారు. ఎండలు మండిపోతున్న కారణంగా భక్తులకు ప్రత్యేక నీడ ఏర్పాట్లు, తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఉన్న రాజ గోపురం లోపల అష్టలక్ష్మి దుర్గే, పంచముఖి దుర్గేల చిత్రాలు ఈ ఏడు భక్తులను విశేషంగా ఆకట్టుకుం టున్నాయి. సాయంత్రం సిడిబండి రథోత్సవం జరగనుంది సోమవారం సాయంత్రం కౌల్ బజార్ ప్రాంతం నుంచి అలంకరించిన సిడి బండిని తీసుకువచ్చారు. ఉత్సవాన్ని తిలకించేందకు లక్షమందికి పైగా రానున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆలయం చుట్టూ ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటును నిషేధించారు. ఆలయం చుట్టు ప్రక్కల ప్రసాదం, మజ్జిగ , పంపిణీ కూడా నిషేధించారు. ఆరోగ్య శాఖ అనుమతి పొందిన తర్వాత తాళూరురోడ్డు, కప్పగల్ రోడ్డు, మోకారోడ్డులో పంపిణీ చేయవచ్చును. రథోత్సవానికి ముఖ్య అతిథులుగా బళ్లారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పాల్గొననున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

● ఏఐడీఎస్‌ఓ డిమాండ్

బళ్లారి సిటీ, మార్చి 18: అప్రజాస్వామ్యంగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని ఏఐడీఎస్‌ఓ జిల్లా ధ్యక్షుడు ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం సెంట్రల్ లైబ్రరీ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఈరన్న అన్ని రాజకీయపార్టీలు దేశ సమస్యలపై దృష్టి పెట్టడం లేదని, తాము రాజకీయంగా ఎదుగడానికి జాతి-ధర్మాలను ముందుకు తీసుకొస్తున్నాయన్నారు. విద్యార్థులు వీటిని ఎదురించాలన్నారు. విలీన ప్రక్రియ ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడాన్ని నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్‌ఓ జిల్లాకార్యదర్శి కంబళి మంజునాథ్, ఎం.శాంతి, ఉమా, ప్రమోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



సెంట్రల్ లైబ్రరీ వద్ద ప్రణాళికను విడుదల చేస్తున్న ఏఐడీఎస్‌ఓ సభ్యులు

పునీత్ రాజ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ముద్దటనూరులో చలివేంద్రం ప్రారంభించిన పునీత్ అభిమానులు

కంప్లి, మార్చి 18 : కన్నడ చిత్రనట పునిత్ రాజ్‌కుమార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కురుగోడు పురసభ సభ్యులు మంజునాథ, హండిజోగి సుంకప్పలు తెలిపారు. పునీత్ రాజ్‌కుమార్ 49వ జయంతి సందర్భంగా ఆయన భావ చిత్రపటానికి కురుగోడు సర్కిల్‌లో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అమృతాభిషేకం నిర్వహించిన అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. మంజునాథ్ హండిజోగి సుంకప్ప మాట్లాడుతూ ఆయన మనతో లేకపోయినా తన చిన్నతనం నుంచి ఎన్నో చిత్రాల్లో నటించి అభిమానులకు గుర్తుండిపోయారు. ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే ముద్దటనూరు వద్ద పునిత్ రాజ్‌కుమార్ అభిమానులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అభిమానులు పేర్కొన్నారు. వీరితో పాటు నాగభూషణ, పేయింటర్ నాగరాజు, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



కురుగోడులో ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు

కంప్లి, మార్చి 18 : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలను తొలగించారు. తహసీల్దార్ రేణుక, పురసభ ముఖ్య అధికారి తిమ్మప్పల నేతృత్వంలో జేసీబీల ద్వారా ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రేణుక మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగించామని, నాయకులు, ప్రజాప్రతినిధులు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టరాదన్నారు.



దెబ్బతిన్న కారు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

పెనుకొండ రూరల్, మార్చి 18 : శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలపరిధిలోని అమ్మవారిపల్లి సమీపంలో కోటక్ కంపెనీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమామహేశ్వరి(34) మృతిచెందగా, కుటుంబ సభ్యులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కడపజిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన మురళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన, భార్య ఉమామహేశ్వరి కొన్నేళ్ల కిందట బెంగళూరులోనే ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారు. వారికి ఇద్దరు పిల్లలు. వారు మూడు రోజుల కిందట కారులో హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరి అక్కడికక్కడే మృతిచెందింది. భర్త మురళి, కుమారుడు చైతన్య, కుమార్తె శ్రీనిధి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 లో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



న్యాయవాదితో కలిసి ఏసీ కార్యాలయం ఫర్నిచర్‌ను స్వాధీనం చేసుకుంటున్న ఫిర్యాదుదారుడు

పరిహారం చెల్లించనందుకు ఫర్నిచర్ జప్తు


● భూమి స్వాధీనం చేసుకుని బాధితురాలికి సొమ్ము చెల్లించకపోవడంపై కోర్టు ఆగ్రహం

రాయచూరు, మార్చి 18 : బాధితులకు పరిహారం చెల్లించకపోవడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు ఏసీ కార్యాలయం ఫర్నిచర్‌ను సోమ వారం జప్తు చేశారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రాయచూరు తాలూకాలోని రాయచూరు శివారు సర్వే నెంబర్ 183/1కు చెందిన భూమి యల్లమ్మది కాగా రైల్వే లైన్ డబ్లింగ్ పనుల్లో అధికారులు భూసేకరణ జరిపారు. అందుకు సంబంధించి ఏళ్ల గడుస్తున్నా పరిహారం ఇవ్వకపోవడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. తక్షణం పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మరో సారి న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కార్యాలయం ఫర్నిచర్ జప్తు చేయాల్సిందిగా కోర్టు ఆదేశించింది. దీంతో అర్జిదారు ఆమె కుటుంబ సభ్యులు న్యాయవాదితో కలిసి సోమ వారం కార్యాలయంలోని ఫర్నీచర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● రైతు సంఘం డిమాండ్

రాయచూరు, మార్చి 18 : జొన్నలు పండించిన రైతులకు ఆర్థిక తోడ్పాటు దక్కేలా జిల్లాలోని అన్ని తాలూకాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం జిల్లాధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని మాన్వి, సింధనూరు తాలూకాల్లో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా వాటిలో కొనుగోలు వ్యవహారాలు సాఫీగా సాగడం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో జొన్నల ధరలు అమాంతంగా తగ్గిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో అన్ని విధాల నష్ట పోయిన రైతులు జొన్న పంట పై ఆశతో ఉన్నారని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రతి రైతు నుంచి జొన్నలు ఖరిదు చేసి వారం రోజుల్లోగా వారికి నగదు చెల్లింపులు జరపాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని, లేదంటే దళారుల చేతిల్లో అన్నదాత మోసపోవాల్సి వస్తుందని వారు వాపోయారు. పలువురు రైతు సంఘం నాయకులు, రైతులు ఇందులో పాల్గొన్నారు.



డీసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతులు

హోసూరు జోన్



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్

డీఎంకే అడ్వొకేట్ కామన్ సెంటర్ ప్రారంభం

హోసూరు, మార్చి 18: హోసూరు ఫార్మర్స్ మార్కెట్ రోడ్డులోని ఓ ప్రైవేట్ భవనంలో డీఎంకే అడ్వకేట్ కామన్ సెంటర్‌ను పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. బార్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజర్ తిమ్మరాయప్ప అధ్యక్షత వహించారు. ఎన్నికల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా నుంచి డీఎంకే తరపున పార్లమెంట్ ఎన్నికలో పోటీ చేసేందుకు 30 మంది దరఖాస్తులు సమర్పించారు. అయితే మిత్ర పక్షంలో కాంగ్రెస్‌కు కృష్ణగిరి జిల్లా కేటాయించారు. డీఎంకే మిత్ర పక్షం మొత్తం 40 నియోజకవర్గాల్లో పోటీ చేయనుందని విజయం కోసం పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. ప్రతిపక్షాల ఎత్తుగడలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య జిల్లా కోశాధికారి సుకుమార్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, మున్సిపల్ ఆరోగ్య కమిటీ ఛైర్మెన్ మాదేశ్వరన్, టీమ్ ఆర్గనైజర్లు ఇక్రమ్ అహ్మద్, కేజీ ప్రకాశ్, సుమన్, రాజా శక్తివేల్ డివిజన్ కార్యదర్శి రాము, పెద్దసంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కారులో అకస్మాత్తుగా మంటలు

హోసూరు, మార్చి 18: హోసూరు జేజే నగర్ ప్రాంతానికి చెందిన అరుణ్ కుమార్ ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. అరుణ్‌కుమార్ తన భార్య, ఇద్దరు పిల్లలో కలిసి కారులో కృష్ణగిరికి ఆదివారం వెళ్లి వాపసు వస్తుండగా బాగలూరు రోడ్డు ప్రాంతానికి చేరుకోగా కారు ఇంజన్‌లోనుంచి అకస్మాత్తుగా పొగలు రావడాన్ని గుర్తించారు. వెంటనే అరుణ్‌కుమార్ కుటుంబీకులు కారునుంచి దిగేశారు. కొద్ది క్షణాల్లో మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి తమ దుకాణాలలోని నీటితో మంటలను ఆర్పేయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. ఘటనతో కొద్దిసేపు కలకలం నెలకొంది.



మంటలు ఆర్పుతున్న స్థానికులు

ఎన్నికల కోసం ప్రత్యేక కంట్రోల్ రూం

హోసూరు(కృష్ణగిరి), మార్చి 18: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, తదితర అంశాలకోసం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా వ్యవస్థ కల్పించారు. ఎన్నికల నియంత్రణ గది, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ కెఎం సరయు స్వయంగా పరిశీలించారు. ప్రజలు ఎన్నికల గ్రీవెన్స్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 24 గంటల ట్రోల్ ఫ్రీ నంబర్ 18004257076, 04343-230121, 04343-230124, 04343-230125కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కంట్రోల్ రూమ్‌లో డిప్యూటీ జిల్లా కలెక్టర్ స్థాయిలో ముగ్గురితో కూడిన 3 బృందాలు , అసిస్టెంట్ స్థాయిలో 6 మంది వ్యక్తులు మానిటరింగ్ ఆఫీసర్ , జిల్లా రోటేషన్‌లో 24 గంటల పాటు పర్యవేక్షిస్తారన్నారు. ప్రశాంత ఎన్నికలకోసం అందరూ సహకరించాలన్నారు. నిబంధలను ఉల్లంఘిస్తే సంబంధిత శాసనసభ నియోజకవర్గంలోని మానిటరింగ్ కమిటీలకు ఫిర్యాదును అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



మానిటరింగ్ కమిటీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

హోసూరు (మత్తిగిరి) మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలోని చెక్‌పోస్ట్‌లలో తనిఖీలు ముమ్మరం చేశారు. కృష్ణగిరి జిల్లాలో 6 అదనపు చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. తగిన బిల్లులు లేకుండా భారీ ప్రమాణంలో నగదు గానీ, ఇతర గిఫ్ట్ వస్తువులుగానీ తరలిస్తే సీజ్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశాకనే అనుమతిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాలైన జూజూవాడి, కర్నూర్, హూనపల్లి, డెంకణీకోట, తళి తదితర ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు



పార్టీ జెండా స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

పార్టీ జెండాలు, బ్యానర్ల తొలగింపు

హోసూరు (సిఫ్‌కాట్) మార్చి 18: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో హోసూరు మహానగర పరిధిలోని మొత్తం 45 వార్డులలో పలు రాజకీయ పార్టీల బ్యానర్లు, జెండా స్తంభాలను తొలగించే ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆచరించారు. ప్రభుత్వ సాధనలకు సంబంధించిన బోర్డులను సైతం ఉంచరాదని స్పష్టం చేశారు. ఏప్రిల్ 19న తమిళనాడులో పోలింగ్ జరగనుంది. హోసూరు నగరంలోని మొత్తం 45 వార్డులలోని సాధన చిత్రాలు, ఫ్లకార్డులు, జెండా స్థంభాలను కార్పొరేషన్ ఉద్యోగులు తొలగిస్తున్నారు.

రెండు బస్సు సర్వీసులు ప్రారంభం

సిరుగుప్ప, మార్చి 18 : సిరుగుప్ప బస్సు డిపో నుంచి రెండు నూతన బస్సు సర్వీసులు ప్రారంభించారు. తాలుకాలో బస్సుల కొరత కారణంగా బళ్లారి బస్సు డిపోలో సిరుగుప్ప నుంచి శిరిగేరికి, శిరిగేరి నుంచి బళ్లారికి రెండు బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ, సిరుగుప్ప బస్సు డిపో మేనేజర్ తిరుమలేష,ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

● కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మార్చి 18 : ప్రధాని నరేంద్ర మోదీ విజయాలను ప్రజలకు వివరించి కొప్పాళ లోక్‌సభ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమా వేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ఉచిత గ్యాస్, బియ్యం అందజేసి ఆదుకున్నా రన్నారు. బళ్లారి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రజల అభివృద్ధిని పట్టించుకోక గోవాలో షికార్లు చేస్తున్నారన్నారు. ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు కేవలం 10శాతం మందికే అందుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, జిల్లా యూత్ అధ్యక్షుడు ఎంఎస్ సిద్ధప్ప, కన్వీనర్ దొడ్డ హులిగప్ప, ప్రధాన కార్యదర్శులు బెళగల్ బసవరాజు, పక్కీరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గాలి శంకరప్ప, మహిళా మోర్చ పదాధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో తాగునీటి ఏర్పాట్లు : తహసీల్దార్



తహసీల్దార్ షంషాలం

సిరుగుప్ప, మార్చి 18 : వేసవి కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు సిరుగుప్ప తహసీల్దార్ షంషాలం తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆయన వివిధ సమస్యల కారణంగా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్ని కార్యాలయాలకు ఆదేశించామన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి వడదెబ్బకు గురి కాకుండా ఉండాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

డీకే పట్టమ్మాళ్ (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత, కర్ణాటక సంగీత విద్వాంసురాలైన డామల్ కృష్ణస్వామి పట్టమ్మాళ్ 1919 మార్చి 19న తమిళనాడు రాష్ట్రం కంచీపురంలో జన్మించారు. నేపథ్యగాయనిగా అనేక భారతీయ భాషా చలన చిత్రాలలో పాడారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, ఎంఎల్ వసంత కుమారి ఆమెకు సమకాలీనులు. వీరు కర్ణాటక గాత్ర సంగీతంలో స్త్రీరత్న త్రయంగా సుప్రసిద్ధులు. కచేరీలో ఆమె ప్రతిభను గుర్తించి పాపనాశనం శివన్ సంగీతం నేర్పించి ప్రోత్సహించారు. గాన సరస్వతి, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ, సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2019 జూలై 16న కన్నుమూశారు.

నాగభూషణం (జయంతి)



'రక్తకన్నీరు' నాగభూషణం 1921 మార్చి 19న ప్రకాశం జిల్లా అనకర్లపూడి గ్రామంలో జన్మించారు. రంగస్థల, తెలుగు సినిమా నటుడు. విలనిజానికి ఒక ప్రత్యేక పంథాను ప్రవేశ పెట్టి, కామెడీ టచ్ ఇచ్చిన నటుడు ఆయన. విలన్ చెప్పే డైలాగ్‌లకు కూడా క్లాప్స్ కొట్టించిన ఘనుడు ఆయన. 1962 మంచి మనసులు సినిమాతో గుర్తింపు పొంది రెండు దశాబ్దాలపాటు ఉజ్వలంగా ప్రకాశించారు. ఉద్యోగ జీవితంలోనూ, నట జీవితంలోనూ నాటకరంగాన్ని విడిచిపెట్టలేదు. తమిళ నాటకాన్ని తెలుగులో రక్తకన్నీరు పేరుతో రాయించి దేశ వ్యాప్తంగా సుమారు 2వేల ప్రదర్శనలు ఇచ్చారు. 25ఏళ్ల పాటు 300మంది కళాకారులకు అన్నం పెట్టింది. ఎన్నో గౌరవాలు, సత్కారాలు అందుకున్నారు. 1995 మే 5న కన్నుమూశారు.

ఫిలిప్ రోత్ (జయంతి)



ఫిలిప్ మిల్టన్ రోత్ 1933 మార్చి 19న న్యూయార్క్‌లో జన్మించారు. అమెరికన్ రైటర్స్‌లో ఎక్కువ పురస్కారాలు అందుకున్న వ్యక్తి. నొవెల్లా గుడ్‌బై, కొలంబస్, ది హ్యూమన్ స్టెయిన్, అమెరికన్ పెస్టోరల్ తదితర రచనలు ఎంతో పేరొందాయి. ఆయన నవలలు, కథలు కొన్ని సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి. పులిట్జర్ పురస్కారం, నేషనల్ బుక్ అవార్డ్, నేషనల్ బుక్ క్రిటిక్స్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2018 మే 22న కన్నుమూశారు.

మోహన్‌బాబు (పుట్టినరోజు)



డైలాగ్‌కింగ్, కలెక్షన్‌కింగ్ పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత మంచు మోహన్‌బాబు 1952 మార్చి 19న చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం మోదుగులపాళెంలో జన్మించారు. అసలు పేరు మంచు భక్తవత్సలం నాయుడు. సినిమా నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు, 570కుపైగా సినిమాల్లో నటించారు. 72 సినిమాలు నిర్మించారు. రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. అనేక హిట్ చిత్రాలో నటించి నిర్మాతగాను ఉన్నారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. విద్యానికేతన్ విద్యాసంస్థను స్థాపించారు. కళలు, విద్యారంగంలో సేవలకు పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. కళాప్రపూర్ణ, నవరస నటరత్నం తదితర అవార్డులు అందుకున్నారు.

బాబు మోహన్ (పుట్టినరోజు)



తెలుగు సినిమా నటుడు బాబు మోహన్ 1952 మార్చి 19న ఖమ్మం జిల్లా బీరోలులో జన్మించారు. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి. రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ సినిమాలపై ఆసక్తితో రాజీనామా చేశారు. తొలి సినిమా 'ఈ ప్రశ్నకు బదులేది'. 'మామగారు' సినిమాలో యాచకుడి పాత్రలో ఉత్తమ నటనకు నంది అవార్డు అందుకున్నారు. రాజేంద్రుడు గజేంద్రుడు, పెదరాయుడు, జంబలకిడిపంబ వంటి సినిమాల్లో మంచి హాస్యపాత్రలో నటించారు. మాయలోడు సినిమాతో స్టార్ కమెడియన్ అయ్యారు.

రాజు క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో 24న ఉగాది ఉత్సవాలు

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజుక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నగరంలోని జయనగర మూడో బ్లాక్‌లోని చామరాజ కల్యాణ మండపంలో ఈ నెల 24న జరుగనున్నాయి. సంఘం అధ్యక్షుడు ఎన్ గణేశ్ రాజు, ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్‌రాజు నగరంలో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజు క్షత్రియ కులానికి చెందిన ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్వేది ఆశ్రమానికి చెందిన ప్రసాద స్వామిజీ సాన్నిధ్యంలో జరిగే ఈవేడుకలో ఉగాదిపచ్చడి పంపిణీతో పాటు సీనియర్ సిటిజన్లకు నూతన వస్త్రాలను బహూకరించనున్నారు. ఇదే సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

బాగేపల్లి, మార్చి 18: తాలూకాలోని ఆచేపల్లి గ్రామంలో విద్యుద్ఘాతంతో ఒక బాలుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. దిబ్బూరహళ్ళికి చెందిన సంచారజాతుల సముదాయానికి చెందిన బాలుడు దేవప్ప (12) మృతుడిగా గుర్తించారు. మేకలకోసం సమీపంలోని చెట్టు ఎక్కి కొమ్మలు కోస్తున్న వేళ చెట్లకొమ్మల మధ్యలో వెళ్తున్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కుగురై కొమ్మల మధ్యలో చిక్కుకుని మృతి చెందాడు. ఘటనపై బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహోత్సవాలు

కదిరి, మార్చి 18: ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహోత్స వాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకురార్పణతో మొదలై ఏప్రిల్ 2న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. పక్షం రోజులపాటు కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా చూసేందుకు కదిరి ప్రాంతంనుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాదిమంది తరలి వస్తారు. బ్రహోత్సవాలకు ప్రతి సంవత్సరం భక్తులు ముడుపు లు కట్టి, వేచి చూస్తుంటారు. బ్రహోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహినోత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. ఈఉత్సవాల్లో ప్రతి రోజు వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఎన్నికల నియమావళిని పాటించండి



సమావేశంలో తహసీల్దార్ బీఎస్ స్వామి తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నియమావళి అమలుకు సహకరించాలని, అనుమతులు లేకుండా ఎటువంటి ప్రకటనలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలపై ఉంచరాదని తహసీల్దార్ బీఎస్ స్వామి ప్రకటించారు. సోమవారం వివిధ పార్టీల ప్రముఖులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బహిరంగ, లేదా ప్రైవేట్ స్థలాల్లో ప్రచారం కోసం అభ్యర్థులు ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. నామినేషన్‌ల సమర్పించేంతవరకు సదరు ఖర్చు పార్టీ లెక్కలో పరిగణిస్తామని, నామినేషన్ అనంతరం అభ్యర్థి లెక్కలోకి చేరుతుందన్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉందని, అంతకుమించితే అనర్హత వేటు పడుతుందన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ఈనెల 26న, నామినేషన్‌ల సమర్పణ ఏప్రిల్ 4న, ఉపసంహరణకు ఏప్రిల్ 8వరకు, పోలింగ్ ఏప్రిల్ 26న ఉంటుందన్నారు. కాగా కౌంటింగ్ జూన్ 4న ఉంటుందన్నారు. కోలారు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లు, ఓటర్ల వివరాలను పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కాగా ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్టు గుర్తిస్తే సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని, 100 నిమిషాల్లోగా చర్యలు తీసుకుంటారన్నారు. అంతేకాక టోల్‌ఫ్రీ నెంబరు 1950కు ఫోన్ చేయవచ్చునన్నారు. హెచ్ క్రాస్, చిలకలనేర్పు, జంగమకోటెలలో మూడు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ పోలీసులు, ఎన్నికల అధికారులు, సెక్యూరిటీగార్డ్‌లు ఉంటారన్నారు. ఎన్నికలకు సంబంధించి సభలు, ఊరేగింపులు, ఇతర అనుమతులకు సంబంధించి సింగిల్‌విండో విధానం అమలు చేస్తున్నామని, సువిధ యాప్ ద్వారా అర్జీలు సమర్పించవచ్చునన్నారు. దివ్యాంగులు ఇంటివద్దనే ఓటింగ్ కోసం సక్ష్యం యాప్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మధుసూధన్, నంజప్ప, నాగేశ్, అనుపల్లి కృష్ణారెడ్డి, ముళ్ళూరు వెంకట రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడటంలో విఫలం

బంగారపేట, మార్చి 18: ప్రభుత్వ భూములను కాపాడడంలో బాధ్యతగా ఉండాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆచరణలో విఫలమయ్యారని రాష్ట్ర రైతుసంఘం (పుట్టణ్ణయ్యవర్గం) ఆరోపించింది. చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయని ఆక్రమణల బారినుంచి కాపాడాలని డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం రెవెన్యూ అధికారి ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం మహిళా జిల్లాధ్యక్షురాలు మాగొంది రత్నమ్మ మాట్లాడుతూ మాగొంది గ్రామం సర్వే 149లో 10 ఎకరాలు ప్రభుత్వ చెరువుకు సంబంధించినది ఉందని, అయితే కొంతమంది ఆక్రమించుకోవడంతో చెరువులో పశువులు నీరు తాగేందుకు సైతం సాధ్యం కావడం లేదన్నారు. గ్రామస్తులు ఇప్పటికే ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. బెంగళూరుకు చెందిన చిక్కనారాయణప్ప అనే వ్యక్తి ప్రహరీగోడను అక్రమంగా నిర్మించారని, అయినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో తీవ్ర పోరాటం చేస్తామన్నారు. నిరసనలో జిల్లా యువ విభాగం అధ్యక్షుడు మంజునాథ్, కరగ నారాయణస్వామి, జిల్లా ప్రముఖులు ఐతాండహళ్ళి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు నితిన్, కార్యదర్శి శ్రీనివాస్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారి ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత

పురస్కార గ్రహీతకు ఘనసన్మానం

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ నిర్మాత పురస్కారాన్ని అందుకున్న తెలుగు ప్రముఖుడు నిర్మాత బిఎన్ రాజశేఖర్‌కు నగరంలో సోమవారం ఆత్మీయ సన్మానం జరిగింది. నిర్మాత రాజశేఖర్ మరిన్ని హిట్ చిత్రాలను అందిస్తూ పురస్కారాలను అందుకోవాలని కార్యక్రమంలో ప్రసంగించిన వక్తలు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో చెన్నపట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు కిషోర్ దంపతులు, కర్ణాటక రాష్ట్ర సమగ్ర బలిజ వేదిక అధ్యక్షుడు మునికృష్ణ, కనకపుర బలిజసంఘం అధ్యక్షుడు బాలణ్ణ, కార్యదర్శి కృష్ణప్ప, ఇట్మడ్లు బలిజ సంఘం అధ్యక్షుడు రాయల్ గురుమూర్తి, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ చిక్కబళ్ళాపుర అధ్యక్షుడు కైవార శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నిర్మాత బీఎన్ రాజశేఖర్ రాష్ట్ర బలిజసంఘం అధ్యక్షునిగా కూడా సేవలందిస్తున్న సంగతి విదితమే.



ప్రముఖ సినీనిర్మాత బీఎన్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో అర్థవంతంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవంలో పాల్గొన్న సభ్యులు

బొమ్మనహళ్ళి, మార్చి 18: నియోజకవర్గంలోని హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని స్వాభిమాన పార్కులో నవజీవన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలు హసీనా నేతృత్వం వహించారు. స్థానికంగా ఉంటున్న ఒంటరి మహిళలు, అనాథ బాలికలకు వసతి, ఉపాధి వంటివి సంఘం ద్వారా కల్పిస్తున్నామన్నారు. మూడు నెలలకోసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ అవసరమైన మందులు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. కొవిడ్ వంటి క్లిష్ట సమయంలో నిత్యావసరాలు, మెడికల్ కిట్‌లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు పర్వీన్‌తాజ్, కార్యదర్శి మునిరత్న, భారతి, శివగామిని తదితరులు పాల్గొన్నారు.

హొంగసంద్రలో కిట్ల పంపిణీ...

ఐఎన్‌టీయూసీ కార్యదర్శి, కట్టడకార్మిక సంఘం అధ్యక్షుడు హెచ్‌సీ శ్యామణ్ణ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్‌కార్డ్ కల్గిన మహిళలకు అవసరమైన సురక్షతా కిట్‌లను పంపిణీ చేశారు. శానిటరీ ప్యాడ్స్, ఇతర ఔషధాలు ఇందులో ఉంటాయి. ప్రభుత్వ వైద్యులు పాల్గొని మహిళలకు పలు సలహా సూచనలు చేశారు. కార్యక్రమంలో పద్మావతి శ్యామణ్ణ, దాస్, విజయ, కట్టడకార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సురక్షతా కిట్లు అందజేస్తున్న శ్యామణ్ణరెడ్డి

ఘనంగా పునీత్‌రాజ్‌కుమార్ జయంతి



పునీత్‌జయంతిలో ప్రముఖులు, ఆశాకిరణ అంధపాఠశాల విద్యార్థులు

శిడ్లఘట్ట, మార్చి 18: పట్టణంలోని కాళికాంబ సముదాయభవనంలో తాలూకా కదంబ సైన్య ఆధ్వర్యంలో నటుడు పునీత్‌రాజ్‌కుమార్ జయంతి ఘనంగా జరిగింది. కదంబసైన్య సంఘం అధ్యక్షుడు, కళాకారుడు సీఎన్ మునిరాజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీ వెంకటేశ్, సంచాలకులు స్పోర్ట్స్ మునిరాజు, కార్యదర్శి శ్రీనివాస్ విశ్వకర్మ, కోశాధికారి ముఖేశ్‌లు పాల్గొన్నారు. పునీత్ చిత్రపటానికి పుష్పాంజలి చేశారు. ఆశాకిరణ పాఠశాల అంధ విద్యార్థులచే కేక్ కట్ చేయించారు. మిఠాయిలు పంచి పెట్టారు. సమాజసేవకురాలు మీనా కృష్ణమూర్తి, ప్రత్యేక ఆహ్వానితులుగా నటి గీతప్రియ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రసమంజరి కార్యక్రమం ఆకట్టుకుంది. నవ్యకల్చర్స్ స్పోర్ట్స్ అండ్ డ్యాన్స్ అకాడమీ దొడ్డబళ్ళాపుర, ఆర్ఎస్ఎస్ మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ, శిడ్లఘట్ట మోనిష బృందం తదితర బృందాలు పాల్గొన్నాయి. కాళికాంబ సముదాయభవనం అధ్యక్షుడు మునిరత్నంచారి, శ్రీనివాస్, రైతు సంఘం ప్రముఖులు శెట్టిహళ్ళి రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

బాగేపల్లి, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా ఇప్పటికే కోడ్ అమలులోకి వచ్చింది. నగదు అక్రమ రవాణా, గిఫ్టులు, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా విధించేందుకు తాలూకాలో నాలుగు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇక్కడ నిరంతరం వాహనాలను తనిఖీ చేసేలా సిబ్బందిని కేటాయించారు. ప్రత్యేకించి శివారులోని ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని టోల్‌గేట్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సహాయ ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్ పాటిల్, బాగేపల్లి తాలూకా తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్‌లు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. చెక్‌పోస్ట్‌లలో వాహనాల తనిఖీల పరిశీలన, సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగదు, సామగ్రి, ఆభరణాలు, వాణిజ్య సామగ్రి వంటి వాటిని తనిఖీ చేయాలని సూచించామన్నారు. తగిన రికార్డులు లేకుంటే సీజ్ చేయాలని ఆదేశించామన్నారు.



పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

ఓటు హక్కుపై వాకథాన్

మహదేవపుర, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు క్రియాశీలకంగా పాల్గొని తమ ఓటు వినియోగించుకోవాలని నటి ప్రణీత సుభాష్ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని మారతహళ్ళిలో బీబీఎంపీ సహకారంతో కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన వాకథాన్‌కు ఆమె పచ్చజెండా చూపి మాట్లాడారు. ప్రజాప్రభుత్వ వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కును అర్హులంతా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్ సెల్వమణి మాట్లాడుతూ ఐటీ రాజధాని బెంగళూరు ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. తకు పరిచయం ఉన్నవారికి, బంధు మిత్రులకు ఓటు ఆవశ్యకత గురించి తెలియచేయాలన్నారు. సుమారు 500 బైక్‌లు, 1200 సైకిళ్లపై వందలాదిమంది ప్రజలు, మహిళలు కూడా వాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ మీడియా ముఖ్యులు జడియప్ప గెద్దగట్టి, కావేరి ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎస్ విజయభాస్కరన్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.



వాకథాన్ ప్రారంభంలో సినీ నటి ప్రణీత సుభాష్ తదితరులు

కవయిత్రికి ఆత్మీయ సన్మానం

బాగేపల్లి, మార్చి 18: తాలూకాలోని ఆదర్శ పాఠశాలలో సైన్స్ టీచర్‌గా ఉన్న బీఎం ప్రమీళాను ఆత్మీయంగా సత్కరించారు. చిక్కమంగళూరుకు చెందిన ఆమె కన్నడ భాషపట్ల ప్రత్యేక శ్రద్ధతో 300కుపైగా కవితలు రాశారు. రాష్ట్ర సావిత్రిబాయిపులె ఉపాధ్యాయినుల సంఘం అధ్యక్షురాలు రాజరాజేశ్వరి, పదాదికారులు సంయుక్తంగా తాలూకాలోని గడిదంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రిగా రాణిస్తున్న ప్రమీళాను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా పురసభ సభ్యురాలు, న్యాయవాది భారతి, టీచర్‌లు కీర్తి బసప్ప, బసప్ప లగళి తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి ప్రమీళాకు సత్కారం

ప్రధాని మోదీకి సీఎం సిద్దరామయ్య సూటి ప్రశ్నలు

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శివమొగ్గ పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పలు ప్రశ్నలను సంధించారు. యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గతంలో శివమొగ్గలో రైతులపై కాల్పులు జరిపారని ఇప్పుడు ఆయన కుమారుడికి ఓట్లేయండంటూ పిలుపునిచ్చేందుకు మీకు మనసెలా వచ్చింది మోదీజీ అని సిద్దరామయ్య ప్రశ్నించారు. ఇందుకు మీ ఆత్మసాక్షిఎలా అంగీకరించిందో అంటూ ఎద్దేవా చేశారు. శాసనసభ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన తక్షణం తొలి కేబినెట్ సమావేశంలోనే జాతీయ బ్యాంకుల్లో రైతులు చేసిన రూ.1 లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తామని బీజేపీ భరోసా ఇచ్చిందని అనంతరం అధికారంలోకి వచ్చినా మాట నిలబెట్టుకోలేదని ఇది రైతులకు చేసిన ద్రోహం కాదా అని ప్రధానిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం కరువు కోరల్లో చిక్కి విలవిల్లాడుతున్నా పలుమార్లు డిల్లీకి వెళ్ళి సాయం కోసం విజ్ఞప్తి చేసినా బుట్టదాఖలు చేయడం రాష్ట్ర రైతాంగానికి చేసిన ఘోరమైన అన్యాయం కాదా అని సీఎం ప్రధానిని నిలదీశారు. అప్పర్ భద్ర పథకానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ.5,300 కోట్లలో ఇంతవరకు ఒక్క నయాపైసా కూడా విడుదల చేయకపోవడం రాష్ట్ర రైతాంగానికి చేసిన ఘోరమైన ద్రోహం కాదా అని సీఎం ప్రశ్నించారు. తీవ్ర కరువు నేపథ్యంలో వ్యవసాయ కూలీల పనిదినాలను నరేగా పథకంలో 100 నుంచి 150కు పెంచమని పదే పదే పెంచమని విజ్ఞప్తి చేసినా స్పందించని మీ రాతి గుండెను ఏమని వర్ణించాలో అంటూ ప్రధానిపై సీఎం విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. రైతులు వద్దో మొర్రో అని మొత్తుకున్నా రాజ్యాంగ విరుద్ధంగా మూడు వివాదాస్పద చట్టాలను ప్రవేశపెట్టి నిరశన ప్రదర్శనల్లో దాదాపు 750 మంది రైతుల ప్రాణాలను బలిగొన్న మీరు రైతుల ఉద్ధారకులు ఎలా అవుతారని ప్రధానిని సీఎం ప్రశ్నించారు. అవినీతి గురించి నీతులు చెప్పే మీరు ఎలక్టోరల్ బాండ్ల అవినీతి అక్రమాలపై మీడియా కోడై కూస్తున్నా ఇంతవరకు స్పందించకపోవడం దారుణమని ప్రధానిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఆయన వరుస పోస్టులు చేశారు.

బీజేపీ ఎమ్మెల్యే పిటిషన్... డీసీఎంకు హైకోర్టు అత్యవసర నోటీసు

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోర్టు విచారణల కోసం డీసీఎం డీకే శివకుమార్ సొంతూరు కనకపురకు వెళితే తనపై దాడి జరిగే అవకాశం ఉందని ఈ కారణంగా బెంగళూరు కోర్టులో విచారణలు జరపాలనే బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ పిటీషన్‌ను హైకోర్టు ధర్మాసనం విచారణలు జరిపింది. సోమవారం న్యాయమూర్తి సునిల్‌దత్ యాదవ్ ఏకసభ్య ధర్మాసనం విచారణలు జరిపి డీకే శివకుమార్‌కు అత్యవసర నోటీసులు జారీ చేసింది. యత్నాళ్ తరుపు న్యాయవాది వాదనల వేళ కనకపుర కోర్టు పరిధిలోనే దావా విచారణలు జరపాలనే డిమాండ్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. కనకపుర సీనియర్ సివిల్ కోర్టు, జేఎంఎఫ్‌సీలో దాఖలు చేసిన పిటీషన్ విచారణను నిలిపివేయాలని వాదించారు. కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం సాగుతున్న 2019 జూన్ 23న ఎమ్మెల్యే యత్నాళ్ విజయపురలో సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌నేత డీకే శివకుమార్ బీజేపీకు చెందిన కొందరు కీలక నేతలను కలిసి తనపై ఉండే ఐటీ కేసుల నుంచి రక్షణ కోరారని ఆరోపించారు. కేంద్రమంత్రి ఒకరి ద్వారా లాబీ చేశారని బీజేపీ జాతీయ అధ్యక్షులపైనా ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశారన్నారు. ఈడీ కేసులను రద్దు చేస్తే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినా అభ్యంతరం లేదని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారని కూడా విమర్శించారు. వీటి ద్వారా నా పరువుకు భంగం కలిగిందని డీకే శివకుమార్ ఏకంగా రూ.204 కోట్ల పరువునష్టం చెల్లించాలని ప్రతివాది యత్నాళ్‌పై కనకపుర కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇదే విషయమై ఎమ్మెల్యే యత్నాళ్ కేవలం నన్ను వేధించాలనే కారణంతోనే కనకపుర కోర్టులోనే విచారణలు జరపాలని పిటీషన్ వేశారని హైకోర్టును ఆశ్రయించారు. నేను ఆరోపణలు చేసింది విజయపురలోనని బీజేపీ సీనియర్ నేతనని, ఎమ్మెల్యేగా ఉన్నానని విజయపుర - కనకపురల మధ్య 565 కిలోమీటర్‌ల దూరం ఉందని పిటీషన్ ద్వారా వివరించారు. కనకపురలోని కేసులను బెంగళూరుకు మార్చు చేయాలని కోరారు. డీకే శివకుమార్ సొంతూరు కనకపుర అని అక్కడ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని ఆయనకు ప్రముఖ నాయకుడని పిటీషన్ ద్వారా వివరించారు. విచారణలు జరిపిన ధర్మాసనం డీసీఎం డీకే శివకుమార్‌కు అత్యవసరంగా నోటీసులు జారీ చేసింది.

అవమానాన్ని భరించలేక ఆత్మహత్య

▸▸ చోరీ చేసిందని.. విద్యార్థిని బట్టలు విప్పి తనిఖీ..

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలి బ్యాగులో ఉంచిన 2వేల రూపాయల నగదు చోరీ అయ్యిందని నలుగురైదుగురు విద్యార్థినులను బెదరించి ఆ తర్వాత బట్టలు తొలగించి పరిశీలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాగల్కోటెలో చోటు చేసుకుంది. బాగల్కోటె జిల్లా కదంపుర హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు బ్యాగులో ఉంచిన నగదు ఈనెల 14న చోరీ జరిగింది. పదో తరగతి చదివే నలుగురు విద్యార్థినులతోపాటు 8వ తరగతి చదివే దివ్య బారకేరపై ఉపాధ్యాయురాలు అనుమానం వ్యక్తం చేశారు. ఐదుగురు విద్యార్థినులను ఓ గదిలోకి తీసుకెళ్లి ఎవరు నగదు తీసుకున్నారో వాపసు ఇవ్వాలని లేదంటే టీసీ ఇచ్చి ఇంటికి పంపుతామని హెచ్చరించారు. ఆ తర్వాత వారందరి యూనిఫాంను తొలగించి పరిశీలించారు. హెడ్మాస్టర్‌తోపాటు నలుగురు ఉపాధ్యాయురాళ్ల సమక్షంలోనే ఈ ప్రక్రియ సాగింది. ఆ తర్వాత వారిని దుర్గాదేవి ఆలయానికి తీసుకెళ్లి ప్రమాణం చేయించారు. అక్కడా వారు తాము 2వేలు చోరీ చేయలేదని ప్రమాణం చేశారు. విషయం పాఠశాలతో పాటు స్థానికంగా సంచలనమైంది. గ్రామంలో ప్రతి ఒక్కరూ దివ్యను అనుమానంగా చూడడంతో జీర్ణించుకోలేకపోయింది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో బాగల్కోటె గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో హెడ్మాస్టర్ మునావర, కారకురాలైన ఉపాధ్యాయురాలిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే శనివారం 2 వేల రూపాయల నగదు ల్యాబ్‌లో లభించినట్టు తెలుస్తోంది. ఉపాధ్యాయుల వేధింపులతోనే మా బిడ్డ ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు వాపోయారు. కాగా సోమవారం సదరు ఉపాధ్యాయుల తీరును బాగల్కోటెకు చెందిన ప్రజా సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. 2వేల రూపాయల కోసం ఉపాధ్యాయులంతా కలసి బట్టలు విప్పించడం ఏం సంస్కారమనే విమర్శలు వ్యక్తం అయ్యాయి.

ఆధ్యాత్మిక పాటలపై అభ్యంతరం... వ్యాపారిపై దాడి

▸▸ అరెస్టుకు ఎంపీ తేజస్వి సూర్య డిమాండ్

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌పీరోడ్డుకు అను బంధమైన నగరత్ పేట సిద్దణ్ణ వీధిలో మొబైల్‌ఫోన్ల వ్యాపారి ముఖేశ్‌ను స్థానిక ముస్లిం యువకుడు దాడి చేయడం వివాదమైంది. జుమ్మామసీదు రోడ్డులోని దుకాణంలో ఆదివారం సాయంత్రం పూజ చేసే వేళ హనుమాన్ చాలీసా వంటి ఆధ్యాత్మిక పాటలు పెట్టారు. ఇదే సందర్భంలోనే కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ యువకులు గుంపుగా వచ్చి ముఖేశ్ దాడి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. రాష్ట్ర బీజేపీ ఎక్స్‌లో తీవ్రంగా మండిపడింది. అన్నివర్గాల శాంతి యుతంగా ఉండే కర్ణాటకలో తాలిబన్ దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపించింది. బాధితుడు హల సూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు సులేమాన్, షానవాజ్, డ్యానిష్‌లతోపాటు మరో ఇరువురిపై కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గురిని అరెస్టు చేశారు. సోమవారం సాయంత్రం బెంగళూరు దక్షిణ బీజేపీ ఎంపీ తేజస్వీసూర్య నగరత్‌పేటను సందర్శించి ముఖైశ్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. హలసూరుగేట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు.



ఘటనపై ఎంపీ ఆరా

రంజాన్ కిట్ల వితరణ

బొమ్మనహళ్ళి, మార్చి 18: రంజాన్ పురస్కరించుకుని సుద్దగుంటపాళ్యలో కాంగ్రెస్ యువ నాయకుడు, ఏఎన్ఎఫ్ హ్యూమానిటి చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు అషీఫుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో సుమారు 9వేల మందికి నిత్యా వసరాలు, వెయ్యి మందికి చీరలు పంపిణీ చేశారు. 9ఏళ్లుగా ఏటా రంజాన్‌వేళ ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్టు షరీఫ్ తెలిపారు. మంత్రి రామలింగారెడ్డి నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కిట్‌లు, చీరలు అందజేస్తున్న షరీఫ్